సూర్య
17వ వసంతంలోకి...
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 2 ఆగస్టు 2024
పేజీలు 8

# ప్రత్యేక కౌంటర్లలో నాణ్యమైన సరుకులు

**రైతు బజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల్లోనూ పొందొచ్చు : జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా**



**విజయవాడ బ్యూరో, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి ఆదేశాలను అనుసరించి జిల్లాలో రైతుబజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల్లో సరసమైన ధరల్లో నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉషోదయ, మెట్రో, రిలయన్స్, డీమార్ట్ తదితర పెద్ద రిటైల్ దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు పొందొచ్చాన్నరు. ప్రస్తుతం మార్కెట్లో కిలో కందిపప్పు (దేశవాళి) ధర రూ.181ఉండగా, ప్రత్యేక కౌంటర్లలో రూ. 150కే అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా కిలో బియ్యం మిగతా 2లో...






# 30ఏండ్ల పోరాట ఫలితం

## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ

- రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవ సంబరాలు
- ధర్మమే గెలుస్తుందని మందా కృష్ణ మాదిగ ఆనాడే చెప్పారు
- ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలిచిన వారందరికీ ఈ విజయం అంకితం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** పోరాటాల యోధుడు మందా కృష్ణ మాదిగ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) స్థాపించి, 30 ఏళ్లుగా ఎన్నో ఆటుపోట్లు, ఎదురు దెబ్బలు, జైలు జీవితాలు అన్నిటిని తట్టుకొని ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రధాన లక్ష్యంగా చేసిన పోరాటాల ఫలితం, ఈరోజు సుప్రీంకోర్టు, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ అన్నారు. ఈ సందర్భంగా పేరెల్లి ఎలీషా మాదిగ ఆధ్వర్యంలో విజయవాడ, తుమ్మల పల్లి కళాక్షేత్రం వద్ద డాక్టర్ బీఆర్.అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి, మహా జననేత, వర్గీకరణ సాధకులు మందా కృష్ణ మాదిగ మిగతా 2లో



## ఆత్మీయ పలకరింపుతో...
## ఎన్టీఆర్ భరోసా

- పెన్షన్ల పంపిణీలో కలెక్టర్ డా. జి.సృజన, ఎమ్మెల్యే గద్దె రామమోహన్
- ఓ మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్న కలెక్టర్
- పేదలపట్ల నిజమైన ప్రేమతో ప్రభుత్వం పనిచేస్తోంది : ఎమ్మెల్యే గద్దె

2లో

# పేదల పెన్నిధి సీఎం చంద్రబాబు



- రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక కష్టాలున్నా ఒకటో తేదీనే పెన్షన్
- తొలి రోజునే 90శాతం పైగా పెన్షన్ల పంపిణీ
- రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం మచిలీపట్నంలో 49వ డివిజన్ నారాయణ పురం యానాదుల కాలనీలో, బందరు మండలం చిన్నాపురం గ్రామంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్థానిక నారాయణపురంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక కష్టాలున్నా పేదలకు ఒకటో తేదీనే పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. పేదల పెన్నిది, ఆత్మ బంధువు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని మంత్రి అన్నారు. చిన్నాపురంలో 100% అంగవైకల్యంతో బాధపడుతున్న బోదాల సునీతకు రూ.15వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడి పూర్తి వైకల్యంతో మంచానికే పరిమితమైన లబ్దిదారుడు కొండేటి నాంచారయ్యను అక్కున చేర్చుకుని మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## ప్రత్యేక కౌంటర్లలో నాణ్యమైన సరుకులు

(స్టీమ్డ్-బీపీటీ/సోనామసూరి) ధర మార్కెట్లో రూ. 55.85 ఉండగా ప్రత్యేక కౌంటర్లలో రూ. 48కే అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కిలో బియ్యం (పచ్చి-బీపీటీ/సోనా మసూరి) రూ. 52.40 ఉండగా.. ప్రత్యేక కౌంటర్లలో రూ. 47కే లభిస్తుందని వివరించారు. అన్ని అమ్మకం కౌంటర్ల వద్ద సరుకుల నాణ్యతను టెక్నికల్ సిబ్బంది, తూకాన్ని లీగల్ మెట్రాలజీ సిబ్బంది తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నిధి మీనా సూచించారు.

## పేదల పెన్నిధి సీఎం చంద్రబాబు



రూ.15 వేల పెన్షన్ అందించారు. కష్టబడి చదువుకున్నప్పటికీ రోడ్డు ప్రమాదం మంచాన పడేసిందని ఆవేదన వ్యక్తం చేయగా ఓదార్చి ధైర్యం చెప్పారు. చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు 50 సంవత్సరాలకే పెన్షన్ ప్రారంభించిందే తమ ప్రభుత్వం అని వివరించి గొర్రె సుబ్బారావు అనే లబ్ధిదారునికి రూ.4వేల చేనేత పెన్షన్ అందించారు. సొసైటీలు మూతబడడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలుపగా, సమస్యల పరిష్కరించేలా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వంతోనే పెన్షన్లు ప్రారంభమయ్యాయని మంత్రి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రూ.30తో పెన్షన్ ప్రారంభించగా, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రూ.75 చేశారని, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ పదేళ్లలో రూ.200 మాత్రమే చేస్తే.. చంద్రబాబు ఐదేళ్లలో ఏకంగా రూ.2000కు పెంచిన విషయం గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఒకేసారి రూ.4000 కు పెన్షన్ పెంపు చేశారని, గత నెలలో 3 నెలల బకాయి సొమ్ముతో కలిపి రూ.7000 ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి పేదల కష్టాలు, వారి ఇబ్బందులు తెలిసిన వారు కాబట్టే వారికి మేలు చేయడం గురించి ఆలోచిస్తున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బందితో తొలి రోజునే 90శాతం పైగా పెన్షన్ల పంపిణీ పూర్తి చేశామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ల నారాయణరావు, మాజీ ఉప సభాపతి బురగడ్డ వేదవ్యాస్, బండి రామకృష్ణ, గొర్రెపాటి గోపీచంద్, ఇలియాస్ పాషా, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్, కుంచె నాని, రోండి కృష్ణ, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, గనిపిశెట్టి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు బస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డిపో మేనేజర్



**కోడూరు, మేజర్ న్యూస్ :** గురువారం ఏపీఎస్ఆర్టీసీ అవనిగడ్డ డిపో మేనేజర్ కె.హనుమంతరావు కోడూరు బస్ స్టేషన్ సందర్శించారు. బస్టాండు పరిసరాలను పరిశీలించారు. అలాగే బస్సులో నడిచే మార్గంలో ఉన్న రోడ్డు గుంటలను పరిశీలించి వాటిని వుడ్ వాటిని పూడ్చించుటకు వెంటనే చర్య తీసుకుంటామని వివరించారు. బస్టాండ్లోని మరుగుదొడ్డు పరిశుభ్రత పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి వారి యొక్క సూచనలు సలహాలు తెలుసుకున్నారు. కోడూరు వైపు నడుస్తున్న బస్సులో యొక్క సమయపాలనతో నడుపుటకు శరీ తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

# 30 ఏండ్ల పోరాట ఫలితం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ






(మొదటిపేజీ తరువాయి)

చిత్రపటానికి పాలాభిషేకం చేసి రిజర్వేషన్ల వర్గీకరణ విజయవంత సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేరెల్లి ఎలీషా మాట్లాడుతూ.. 30 ఏండ్ల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని 2004లోనే మంద కృష్ణ మాదిగ చెప్పారన్నారు. అధర్మం తాత్కాలికమైనదని వెల్లడించారని అన్నారు. వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకే ఉందని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం 6:1 తేడాతో తీర్పువెలువరించడం ఆనందించదగ్గ విషయమన్నారు. 30 ఏండ్లుగా పోరాటం చేస్తున్న ఈ క్రమంలో చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఉద్యమాలను దెబ్బతీసే కుట్రలు ఎన్నో జరిగాయని ఎలీషా మాదిగ విమర్శించారు. అయినా సహనం కోల్పోకుండా మంద కృష్ణ మాదిగ పట్టుదలతో పోరాటం చేసి విజయం సాధించారని తెలిపారు. 1994లో ప్రకాశం జిల్లా ఈదుమూడిలో వర్గీకరణ ఉద్యమాన్ని మంద కృష్ణ మాదిగ ప్రారంభించారని, జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు పోరాడారన్నారు. న్యాయం కోసం ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలిచిన వారందరికీ ఈ విజయం అంకితం ఇస్తున్నామని మంద కృష్ణ మాదిగ చెప్పారన్నారు. ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు కూడా సరిచేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారని, వర్గీకరణకు జనాభా లెక్కలతో పనిలేదన్నారు. త్వరలో విజయోత్సవ సభ నిర్వహిస్తామని, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతామన్నారు. ఎంఆర్పీఎస్‌లో ఎన్నో త్యాగాలు చేసి అమరులైన ఉద్యమకారులకు, దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని, పెద్దలు వెంకయ్య నాయుడుని, ఉద్యమం మొదటి నుంచి కృష్ణ మాదిగ కి అండగా నిలిచిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని, సమాజంలో ఏనాటికైనా న్యాయమే గెలుస్తుంది అని గుర్తించేలా తీర్పు నిచ్చిన 7 జడ్జిలను, న్యాయ వ్యవస్థను, సమాజంలో సామాజిక కోణంలో సహకారం అందించిన అన్ని వర్గాల ప్రజలను, మా ఆవేదనను సమాచారం రూపంలో సమాజానికి చేరే విధంగా సహకారం అందించిన మీడియా మిత్రులను, పోలీస్ వారిని, ప్రజా ప్రతినిధులను, ఉద్యమానికి సహకారం అందిస్తూ అండగా నిలిచిన ప్రతి ఒక్కరిని ఈ విజయంలో భాగస్వాములను చేస్తూ.. వీరందరికీ మహాజననేత మందకృష్ణ మాదిగ తరపున, ఎంఆర్పీఎస్ ఆంధ్రప్రదేశ్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సుబ్బారావు మాదిగ, మందా వెంకటేశ్వర మాదిగ, కోట దానియేలు మాదిగ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లింగాల నరసింహులు మాదిగ, కాంపాటి వెంకటేశ్వరరావు మాదిగ, కొల్లూరి బసవ, ఆదూరి నాగమల్లేశ్వరరావు, కొక్కిలిగడ్డ సువర్ణ రాజు, నూకపోగు ఏసు, మామిడి రాంబాబు, ఇసుకపల్లి చంటి, వేల్పుల సురేష్, పేటేటి కిషోర్, దేవులూరి టోనీ, జిల్లా సురేష్, వింజమూరు విష్ణు, మార్టుపూడి రామారావు, బంక రాజు, యాకోబు, నకిరికంటి సురేష్, కటికల సైదులు, పసుమర్తి దినేష్, కొల్లూరు దినేష్, శీలం శర్మ, గణేష్, పేరెల్లి ప్రభు కుమార్, గోపాలకృష్ణ, వికాస్, దుప్పల సురేష్, ఊటుకూరి డేవిడ్, సన్నీ, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ పలకరింపుతో ఎన్టీఆర్ భరోసా



**పెన్షన్ల పంపిణీలో కలెక్టర్ డా. జి.సృజన, శాసనసభ్యులు గద్దె రామమోహన్**

**ఓ మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్న కలెక్టర్**

**పేదలపట్ల నిజమైన ప్రేమతో ప్రభుత్వం పనిచేస్తోంది**

**తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామమోహన్**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి ఇళ్లవద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల మొత్తాన్ని అందించే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామమోహన్.. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. విజయవాడ యనమలకుదురు రోడ్డు, కృష్ణానగర్‌లో గురువారం జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములై లబ్ధిదారులను స్వయంగా కలిసి పెన్షన్ మొత్తాన్ని అందించారు. ముఖ్యమంత్రి తరపున క్షేమసమాచారాన్ని తెలుసుకొని ఎస్.ఆశీర్వాదం, రజియాబేగం, పి.మేరీలకు వృద్ధాప్య పెన్షన్ మొత్తం రూ. 4 వేలు చొప్పున అందించారు. అదేవిధంగా డయాలసిస్ చేయించుకుంటున్న నాగవరపు బాలాజీకి రూ. 10 వేల పెన్షన్ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.సృజన మాట్లాడుతూ జిల్లాలో 2,34,143 మంది పెన్షన్‌దారులకు దాదాపు రూ. 99 కోట్ల మేర అందించడానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు తమకు మ్యాప్ చేసిన లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పెన్షన్ మొత్తం అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున భాగస్వాములయ్యారని.. ఇంతమంచి కార్యక్రమంలో తాను పాల్గొనడం ఆనందంగా ఉందని కలెక్టర్ సృజన పేర్కొన్నారు.

**పేదల క్షేమం, సంక్షేమంపై చిత్తశుద్ధి: ఎమ్మెల్యే గద్దె రామమోహన్**

పేదలు ఇబ్బందిపడకూడదనే ఉద్దేశంతో ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేసి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల మొత్తాన్ని అందించినట్లు విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామమోహన్ అన్నారు. పేదల క్షేమాన్ని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారిపై నిజమైన ప్రేమతో, చిత్తశుద్ధితో ప్రభుత్వం సేవలందిస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతోనే ఇళ్ల వద్దనే పెన్షన్ల మొత్తాన్ని అందించడం జరుగుతోందని.. గతంలో సాధ్యం కాదన్న దాన్ని సుసాధ్యం చేసి చూపామన్నారు. కొత్తగా అర్హులు ఎవరైనా ఉంటే వారిని కూడా గుర్తించి పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అదే విధంగా గతంలో వివిధ కారణాల వల్ల పెన్షన్లు నిలిచిపోయిన వారి జాబితాను మళ్లీ సమీక్షించి.. అర్హత ఉన్నవారికి కూడా లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. పెన్షన్ మొత్తాన్ని పెంచి పేదలకు అందిస్తున్న ముఖ్యమంత్రికి లబ్ధిదారుల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ ఎం.ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బీసీ బాలుర వసతి గృహంలో నోటు పుస్తకాలు జామెంట్రీ బాక్సులు పంపిణీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో 9,10 తరగతి విద్యార్థులకు బుధ వారం సాయంత్రం నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని మండలిపురంలోని బాలుర వసతి గృహంలో పుష్కర్ పంపిణీ చేసిన మంత్రం రాయపూడి మాట్లాడుతూ, గత రెండు రోజుల క్రితం ఈ వసతి గృహమునకు పరిశీలన నిమిత్తం వచ్చినప్పుడు,ఇక్కడ ఉన్న పరిస్థితులను గమనించి విద్యార్థులకు కావలసిన అవసరాలను అడగటం జరిగిందని, విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న నోటు బుక్స్ చాలటం లేదని మా దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఈ విద్యార్థులకు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఎందుకంటే నూతన ప్రభుత్వం ప్రజల పట్ల మంచి ఆలోచనతో ముందుకు వెళుతూ,నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృశ్య మేము కూడా ప్రభుత్వానికి కొంత అండగా ఉండాలని విద్యార్థులకు ఈ సహకారాన్ని అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా అవనిగడ్డ నియోజకవర్గంలోని దాతలు మీ పరిసర ప్రాంతాల్లో ఉన్న బీసీ, ఎస్సీ,వసతి గృహాల్లోని పరిస్థితులను పరిశీలించి నిరుపేదలకు అండగా నిలవాలని కోరుచున్నామన్నారు. నియోజక వర్గంలోని ప్రతి వసతి గృహం కు కావలసిన మౌలిక సదుపాయాల విషయంలో, నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సహకారంతో, గత ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వదిలివేసిన వసతి గృహాలు లోని సమస్యలు తప్పకుండా నెరవేర్చటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారి భాస్కర రావు, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

## ఇండియా చీర్స్ ఫర్ నీరజ్ ప్రచారాన్ని ప్రారంభించిన శాంసంగ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** ఇండియా చీర్స్ ఫర్ నీరజ్ ప్రచారం ద్వారా నీరజ్ చోప్రాకు తమ శుభాకాంక్షలు తెలియజేయడానికి అభిమానులను ముందుకు రావాలని కోరుతున్నట్లు శాంసంగ్ ప్రకటించింది. ఈ ప్రచారంతో, నీరజ్‌కు మద్దతునివ్వడం, శ్రేష్ఠత కోసం ప్రయత్నిస్తూ తన హద్దులు దాటి ముందుకు వెళ్లేలా ఆయనకు ప్రోత్సాహం అందించటం శాంసంగ్ ఇండియా లక్ష్యంగా చేసుకుంది. నీరజ్ చోప్రాకు అందిస్తున్న అభిమానుల మద్దతును పెంచడానికి, వినియోగదారుల ఉత్సాహాన్ని చానలైజ్ చేయడానికి, దేశం యొక్క సామూహిక ప్రోత్సాహాన్ని పెంపొందించడానికి, శాంసంగ్ ఇండియా ఒక చిత్రాన్ని ఆవిష్కరించింది. అనేక సవాళ్లతో పోరాడుతున్న ప్రసిద్ధ అథ్లెట్ యొక్క స్థిరత్వం, సంకల్ప స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, ఈ చిత్రం శాంసంగ్ ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 స్మార్ట్‌ఫోన్ అతని ప్రయాణానికి ఎలా సహాయపడుతుందో హైలైట్ చేస్తుంది.

## మానవత్వం చాటుకున్న మండలి శివ ప్రసాద్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళి మానవత్వం చాటుకున్నాడు అదే గ్రామానికి చెందిన మండలి శివ ప్రసాద్. గన్నవరం ప్రాంతానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో విషయం తెలుసుకున్న శివ ప్రసాద్ అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్ళి ప్రాదమిక వైద్యం అందదచేసి,కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ఆసుపత్రికి ఆ యువకుడిని తీసుకెళ్ళారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన శివను పలువురు అభినందించారు.

## స్పందన బాలల మధ్య ప్రముఖ అడ్వకేట్, సామాజిక వేత్త కె.వి రమణ జన్మదినోత్సవం



**గన్నవరం, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** దివ్యాంగులకు, వృద్దులకు, పేద విద్యార్థులకు, అనాధులకు వితంతువులకు, క్రీడాకారులకు అండగా ఉండటమే కాకుండా సమాజంలో ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తున్న మానవాతవాది, సామాజిక వేత్త గన్నవరం ప్రముఖ అడ్వకేట్ కె.వి రమణ కి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ స్పందన మానసిక వికాస కేంద్రం తరుపున సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, స్పందన మానసిక దివ్యాంగ బాలలు గురువారం జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ సామాజిక వేత్త, ప్రముఖ అడ్వకేట్ గన్నవరం నియోజకవర్గం లో ప్రభుత్వ పాఠశాల మౌలిక సదుపాయాలు కల్పనకు సహాయం అందించారని, అలాగే మరిన్ని సేవాకార్యక్రమాలు చేసే భాగ్యం మీకు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇవ్వాలని వెంకట్ కోరారు. సామాజిక వేత్త, ప్రముఖ అడ్వకేట్ కె.వి రమణ మాట్లాడుతూ దివ్యాంగులు అంటే భగవంతుని స్వరూపాలని, అలాంటి వారికి సేవలు చెయ్యడమంటే సాక్షాత్తు భగవంతునికి చేసినట్లుని, ఇలాంటి సేవలు నాకు ఇష్టమని, వెంకట్ ఈ సమాజానికి ముఖ్యంగా దివ్యాంగులకు చేస్తున్న సేవలకు కె.వి.రమణ అభినందనలు తెలిపారు. స్పందనకు తప్పకుండా అండగా ఉంటామని కె.వి రమణ అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ డి.విజయలక్ష్మి, సింధు బావిశెట్టి ప్రదీప్ పాల్గొన్నారు. కలపాల వెంకట రమణకి స్పందన ప్రిన్సిపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సుప్రీం కోర్టు తుది తీర్పు ప్రకటించడపట్ల హర్షం



**గన్నవరం, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ కు అనుకుంలంగా సుప్రీం కోర్టు తుది తీర్పు ప్రకటించడపట్ల ఆంధ్రప్రదేశ్ రెల్లి ఉద్యోగుల సంఘము ప్రధాన కార్యదర్శి ధనియాల నాగరాజు గురువారం హర్షం ప్రకటించారు. ఈ తీర్పు సామాజిక న్యాయం అని నాగరాజు తెలిపారు. ఈ తీర్పు వలన అనేక మంది వెనుకబడిన వారికి విద్య, ఉద్యోగాలలో అవకాశం లభిస్తుందని నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తుది తీర్పు అనుసరించి తెలంగాణా ప్రభుత్వం వలే ఈ విద్యా సంవత్సరం లోనే వర్గీకరణ అమలు జరిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర రెల్లి ఉద్యోగుల సంఘము ప్రధాన కార్యదర్శి ధనియాల నాగరాజు విజ్ఞప్తి చేశారు. అలా జరిగితే ఎంతో మంది విద్యార్థుల జీవితాలలో చంద్రబాబు వెలుగు ప్రసాధించిన వారవుతారని నాగరాజు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఏజెండాలో అంశాలను వ్యతిరేకిస్తే అసభ్య పదజాలంతో దూషిస్తారా

**పెడన, మేజర్ న్యూస్ :** బుధవారం పురపాలక సంఘ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలోని రెండు అంశాలను వ్యతిరేకిస్తే చైర్ పర్సన్ భర్త అసభ్య పదజాలంతో కౌన్సిల్ సాక్షిగా ఒక మహిళ కౌన్సిల్ సభ్యురాలు అయిన తనను అసభ్య పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె స్థానిక కాపుల వీధులు పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురపాలక సంఘంలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని కౌన్సిల్ సమావేశాలలో వాటిని వ్యతిరేకిస్తుంటే తట్టుకోలేక తనపై అసభ్య పదజాలంతో చైర్పర్సన్ భర్త దూషిస్తున్నారని అన్నారు. కౌన్సిల్ సాక్షిగా తనను దూషిస్తుంటే చైర్ పర్సన్ ఒక మహిళ అయ్యుండి కూడా సాటి మహిళపై జాలి చూపించకపోవడం బాధాకరమన్నారు. మున్సిపాలిటీలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని వాటిని త్వరలోనే బయటపెడతామని తెలిపారు. అనంతరం జనసేన నాయకులు కోట నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో లేని స్థలాలను ఇతరులకు ధారాఘత్వం చైర్పర్సన్ చేస్తున్నారని, ఇటీవల మాజీ సైనికులకు సంబంధించిన స్థలం కూడా మున్సిపల్ పరిధిలో లేదని అది ఒక పంచాయతీకి సంబంధించినదని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకున్నాం అన్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అనాలోచిత నిర్ణయాల వల్ల కోర్టులలో కేసులు ఎక్కువయ్యాయని వాపోయారు. అంతేగాక పారిశుద్యానికి సంబంధించిన వాహనాలకు డీజిల్ విషయాలలో కూడా భారీ అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ల సుబ్రహ్మణ్యం, వెలిగట్ల వరప్రసాద్, బత్తుల శివశంకర్, కోన కార్తీక్, భార్గవ్ ఉన్నారు.

## సమాజంలో ఉన్న ట్రాన్స్ జండర్‌లను గౌరవించాలి



**గన్నవరం, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** సమాజంలో ఉన్న ట్రాన్స్ జండర్ లను గౌరవించాలని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్, అఖిల భారత శ్రీకృష్ణ దేవరాయల సంఘం నేషనల్ కన్వీనర్ సంకాబత్తుల వెంకట్ అన్నారు. గన్నవరంలో సోమవారం జగ్గయ్యపేట పట్టణం కు చెందిన ప్రశాంతి అనే ట్రాన్స్ జండర్ స్దితి గతులను, వారు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడగగా వారికి ప్రభుత్వం నుండి పెన్షన్ రావడంలేదని తెలియజేయడం జరిగింది. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని వెంకట్ హామీ ఇచ్చారు.

## బెరాకా వ్యవస్థాపకులు సత్యనారాయణ సేవలు మరువలేనివి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం బెరాక ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు బట్టంకి సత్యనారాయణ మరణం మచిలీపట్నానికి తీరనిలోటు అని పలువురు వక్తలు అన్నారు. ఎందరో పేద విద్యార్థులకు అనాధలకు బెరాక సంస్థల సత్యనారాయణ వారి కుమారులు కిరణ్ పాల్ చేస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. ఎందరో నిరుపేద కుటుంబాలకు బెరాక అండగా నిలబడిందని, సత్యనారాయణ కుటుంబం మొత్తం సేవకు పునరంకితం అయిందని బాలాజీ అన్నారు. ఎందరో అభాగ్యులకు బెరాక ప్రార్థన మందిరం ద్వారా సహాయ సహకారాలు అందించడం మచిలీపట్నం ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోతుందని అన్నారు. నిత్య దైవ ప్రార్థనలతో సత్యనారాయణ అనేకమందికి ఆధ్యాత్మిక చేయూత అందించడం జరిగిందని అన్నారు. గురువారం సత్యనారాయణ మృతదేహానికి న్యాయవాది లంకి శెట్టి బాలాజీ, మచిలీపట్నం డ్రగ్స్, కెమిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి మాదిరెడ్డి అంజిబాబు, సీనియర్ జర్నలిస్టులు ముదిగొండ శాస్త్రి దేవన బోయిన రాజేష్, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి అనేకమంది చర్చి ఫాదర్ లు, పుర ప్రముఖులు బెరాక భక్తులు సత్యనారాయణకు ఘనంగా నివాళులర్పించారు.

# శ్వాసకోశ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా బీసీజీ టీకాను వేయించుకోండి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ సచివాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర సూచనలతో తెలుగుదేశం పార్టీ డివిజన్ ఇంచార్జ్ పి. వి. ఫణి కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ ప్రజలకు సచివాలయ 45వ డివిజన్ హెల్త్ సెక్రెటరీ జక్కుల గంగాభవాని పర్యవేక్షణలో గురువారం షుగర్ టెస్టులు, (బి.సి.జి) రోగ నిరోధక శక్తిని పెంచే వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి 45వ డివిజన్ సచివాలయ హెల్త్ సెక్రెటరీ, జక్కుల గంగాభవాని మాట్లాడుతూ టి బి, శ్వాసకోశ వ్యాధులు రాకుండా,, రోగ నిరోధక శక్తిని పెంచడానికి బి.సి.జి వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. ఈ వ్యాక్సిన్ గత ఐదు సంవత్సరాలలో టి బి వచ్చి తగ్గిపోయిన వాళ్ళు, టి బి వచ్చిన వారి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్నవారికి, పొగ త్రాగేవారికి, షుగర్ వ్యాధి ఉన్నవాళ్లు, 60 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు ఈ బి.సి.జి వ్యాక్సిన్ వేయించుకోవడం వలన ఎంతో ఉపయోగం ఉంటుంది అన్నారు. ప్రతి ఒక్కరు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవడం కోసం బాధ్యతగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి అన్నారు. 45 డివిజన్ సచివాలయంలో డివిజన్ ప్రజల కోసం ప్రతిరోజు షుగర్ టెస్ట్ లు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయడం జరుగుతుంది అన్నారు. 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ రోగ నిరోధక శక్తిని పెంచే బిసిజి వ్యాక్సిన్ 45వ డివిజన్ సచివాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు ప్రతి సోమవారం, గురువారం, శుక్రవారం షుగర్ టెస్ట్ లు చేయడంతో పాటు, రోగ నిరోధక శక్తిని పెంచే బీసీజీ వ్యాక్సిన్ వేస్తారు అని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి లు సచివాలయాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ సంక్షేమ కార్యదర్శి, ఏ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## అనాథ బాలలకు లంచ్ బాక్సులు వితరణ

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** బందరు మండలం మంగినపూడిలోని మైఖేల్ అంసాల్డో సోషల్ సర్వీస్ సొసైటీ గుణదల వారి ఆధ్వర్యంలో జరిగిన ఓర్ఫాన్స్ డే వేడుకలలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాలబాలికల కు మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 10,000 విలువైన లంచ్ బాక్సులు వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మైత్రీ ఫౌండేషన్ ద్వారా మచిలీపట్నం, పరిసర ప్రాంతాలలో చేస్తున్న సేవా కార్యక్రమాలు గురించి అడిగి తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్, సభ్యులు కనక రాజు, హర్షిత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నూరు శాతం పెన్షన్ పంపిణీ చేసిన పద్మావతి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అశ్వ రావుపాలెం గ్రామ సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీలో భాగంగా పంచాయితీ కార్యదర్శి గ్రేడ్ 6 డి పద్మావతి 71 పెన్షన్లకు గాను 71 పెన్షన్లను ఉదయం 6 గంటల సమయానికే పంపిణీ చేసి నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లోని 31 వ రాత్రికే చేరుకోవాలని ఆదేశాలు ఉండటంతో పద్మావతి వేకనూరు గ్రామానికి బుధవారం రాత్రే చేరుకుని వేకువజామున 3 గంటల నుండి పెన్షన్ పంపిణీ ప్రారంభించి ఉదయం 6 గంటల సమయాన్ని కల్లా 71 పెన్షన్లు పంపిణీ చేసి మొదటి స్థానంలో నిలవడంతో పద్మావతికి పలువురు అభినందనలు తెలిపారు.

## వృద్ధులకు, వికలాంగులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వృద్ధులకు, వికలాంగులకు, నిరుపేదలకు, సాదువులకు, వితంతువులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. మాజీ ఉపసర్పంచ్ గాజుల గోపి కుమారుడు వర్షిత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం షిరిడిసాయి అన్న ప్రసాద నిర్వాహకులు చిట్టా ప్రసాద్ చేతుల మీదుగా భోజనం ప్యాకెట్లను 80 మందికి పంపిణీ చేశారు. గత 9 సంవత్సరాలుగా ప్రతి రోజు వృద్ధులకు, వికలాంగులకు, సాదువులకు, నిరుపేదలకు షిరిడి సాయి అన్నప్రసాదం ఆధ్వర్యంలో నిర్వాహకులు చిట్టా ప్రసాద్ ఎండా, వాన సైతం లెక్కచేయకుండా నిర్విరామంగా భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు.

## ఎన్నికల మానిఫెస్టో ప్రకారం పెన్షన్లు పంపిణీ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న ప్రభుత్వం ఎన్‌డిఏ ప్రభుత్వం అని పలువురు నేతలు కొనియాడారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు ఆ పార్టీ నేతలు కర్రా సుధాకర్, మోగావత్తు గోపి, అడపా శ్రీను, బచ్చు రమణలు ఉదయం 5 గంటల నుండి అవనిగడ్డ 2 వ వార్డులో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికి ఎన్‌టిఆర్ భరోసా ఫెన్షన్లు 1న 5 గంటల కల్లా పెన్షన్ దారులకు అందచేయాలని చెప్పిన మాట నిలబెట్టుకుని ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గోడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పెన్షన్లు వెయ్యి రూపాయలు పెంచుతూ ఇంటి వద్దకే వేకువజామునే ప్రతి ఒక్క లబ్దిదారుడికి అందిస్తున్నటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలుపుకుంటూ ప్రతి ఒక్క లబ్దిదారులు ధన్యవాదాలు తెలియచేస్తూ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ ఇటువంటి ప్రభుత్వం చిరకాలం ఉండాలని ఆశీర్వదిస్తున్నారని చెప్పారు.



## రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకూడదు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా డ్రైనేజిలు అభివృద్ధి చేయాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అధికారులకు స్పష్టం చేశారు. అవనిగడ్డ సివారు బందలాయిచెరువు మైనర్ డ్రైనేజిని గురువారం ఆయన పరిశీలించారు. బందలాయిచెరువు, అశ్వరావుపాలెం, పోటుమీద గ్రామాల పరిధిలోని పంట పొలాల్లోని మురుగు నీటిని రత్నకోడు మేజర్ డ్రెయినేజిలోకి మళ్ళించే బందలాయి చెరువు మైనర్ డ్రైనేజి 6 కి.మీ పొడవున పూడికతీత అభివృద్ధి పనులను బుద్ధప్రసాద్ పరిశీలించి మాట్లాడారు. పనుల పురోగతిని డ్రైనేజి శాఖ చల్లపల్లి, సబ్ డివిజన్ డిఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు వివరించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎం.ఎల్.ఎ బుద్ధప్రసాద్ చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు విడుదల చేయించి, జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ సహకారంతో షార్ట్ టెండర్ పద్ధతిలో పనులు చేపట్టిన నేపథ్యంలో రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం కలిగేలా పనులు నిర్వహిస్తున్నట్లు డిఈఈ తెలిపారు.

## జనసేన సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనాయకుడు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యకర్తల శ్రేయస్సు కాంక్షించే జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సిఎం కొనిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు చేపట్టిన నాల్గోవ విడత జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో 3 వ విడుతలో మొత్తం 6 వేలు పైగా సభ్యత్వాలు నమోదు చేయించిన పార్టీ క్రియా వాలంటీర్లు ఈ సారి రెట్టింపు ఉత్సాహంతో 10 వేలు పైగా క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయడం శుభపరిణామం అన్నారు. సభ్యత్వ నమోదు గడువు ఆగష్టు 5 వ తేది వరకు పొడిగించిన నేపథ్యంలో నియోజకవర్గంలో మరో 10 వేల క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయడమే లక్ష్యంగా క్రియా వాలంటీర్లు కృషి చేయాలని వెంకట్రామ్ అన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచనలు అనుసరించి పార్టీ కోసం శ్రమిస్తున్న ప్రతి ఒక్క కార్యకర్త కుటుంబం శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అధినేత పవన్ కళ్యాణ్ ఎంతో సమున్నత ఆలోచనతో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనసైనికులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** గర్భిణీ స్త్రీలు, కౌమార బాలికల్లో రక్తహీనత (అనీమియా) నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమై అమలు చేస్తున్న వివిధ పథకాలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రస్తుత పరిస్థితుల్లో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ముందస్తు వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విషపూరిత పాముకాటు కేసులు పెరగటానికి అవకాశం ఉందని, ఆలస్యం చేయకుండా వెంటనే చికిత్స చేయాలన్నారు. యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు తదితర అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీటి పైపులు లీకై మురుగు నీరుతో కలుషితమై అతిసార వ్యాధులు (డయేరియా) ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి నిర్మూలించేందుకు ఎంఎల్ హెచ్ పి లకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామని, ఇందులో భాగంగా 30 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తుల రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ అనే మూడు సాధారణ రకాల క్యాన్సర్లను పరీక్షించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని వైద్యాధికారులు కలెక్టర్కు వివరించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో డాక్టర్ జి గీతాబాయి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, మచిలీపట్నం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుందరాచారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అమ్మవారికి ఆషాఢ సారె భక్తి శ్రద్ధలతో సమర్పించారు. మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో వేంచేసి ఉన్న పోలాశమ్మ అమ్మవారికి భక్తులు భక్తి శ్రద్ధలతో ఆషాఢమాస సారె సమర్పించారు. భక్తులు ముందుగా మేళతాళాలతో, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, ద్వాదశి తిథిని పురస్కరించుకుని గురువారం పోలాశమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమ, చలివిడి, చీర, సారె, 11 రకాల స్వీట్లతో సారె సమర్పించారు. అమ్మవారికి సారె సమర్పించడంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు స్వయంగా పర్యవేక్షించారు.

# సమర్థవంతమైన పరిపాలనను అందించడమే చంద్రబాబు లక్ష్యం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని ఓమ్ము కానివ్వకుండా రాష్ట్రంలో ఉన్న రాక్షసులను బంగాళాఖాతంలో తొక్కేసి సమర్థవంతమైన పరిపాలనే చంద్రబాబు లక్ష్యం అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ డివిజన్ ఇంచార్జ్, పి.వి.ఫణి కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా డివిజన్ సచివాలయ సిబ్బందితో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ పాల్గొని పెన్షన్లు పంపిణీ చేసి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సమర్థవంతమైన పరిపాలనను ప్రజలకు అందించడమే చంద్రబాబు లక్ష్యం అన్నారు. సమాజంలో ఓటు తెచ్చిన మార్పుతో రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో సమర్థవంతమైన పరిపాలన ప్రజలు చూస్తున్నారు అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు వేల రూపాయలు, వికలాంగులకు 6000 రూపాయలు పెంచిన విధంగా తెల్లవారక ముందే ఇంటి వద్ద అందించడం చూస్తుంటే వైసీపీ నాయకులు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ఎన్నికల కోడ్ ను అడ్డం పెట్టుకుని గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పెన్షన్ల కోసం వృద్ధులను, వికలాంగులను ఎన్నో ఇబ్బందులు పెట్టి శవ రాజకీయాలు చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. సమర్థవంతమైన పరిపాలనతో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పంపిణీ చేయుటకు శ్రీకారం చుట్టారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ని గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి అతలాకుతలం చేసిన చంద్రబాబు ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటారు అన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, పి. వి. ఫణి కుమార్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు, గంజాల రవికుమార్, కొనకళ్ళ అరుణ్, అబ్బాస్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు అమృతం ప్రథమ టీకా



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు ఒకటో తేదీ నుండి ఏడో తేదీ వరకు అవగాహన కార్యక్రమ ప్రారంభ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను, బ్యానర్లను, కరపత్రములను ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ,డాక్టర్ జి. గీతాబాయి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని, డాక్టర్ శ్రావణ్ కుమార్ జిల్లా కోఆర్డినేటర్ ఫర్ ఆరోగ్య సర్వీసెస్, డాక్టర్ ఎన్. సుందరాచారి గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా అని బిడ్డ జన్మించిన గంటలోపే తల్లిపాలు త్రాగించాలని క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలలో అవగాహన కల్పించవలసినదిగా ఆదేశించారు. జన్మించిన మొదటి గంటలోపే కేవలం తల్లిపాలు బిడ్డకు జీవ రక్షక బిందువులని బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి యొక్క పసుపు రంగులో ఉన్న చిక్కటి ముర్రుపాలు అమృతం లాంటివని వీటి ద్వారా బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయన్నారు. తల్లిపాలు శిశువును న్యూమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి రక్షణతో పాటు పిల్లలలో మేధస్సును మెరుగుపరచటలో తోడ్పాటునందిస్తుంది. తల్లిపాలు అధిక రక్తపోటు, మధుమేహము, స్థూలకాయం వచ్చే అవకాశాలను చాలా మేరకు తగ్గిస్తాయి. తల్లిపాలు ఇచ్చే వారిలో రొమ్ము, గర్భాశయం, అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తక్కువగా ఉంటుంది. తల్లిపాలు ఇవ్వడం వలన అదనపు బరువు తగ్గటానికి సహాయపడుతుంది. దీనితోపాటు తల్లిపాలు తల్లి, బిడ్డ మధ్య బంధాన్ని పెంచుతుంది. నవజాత శిశువు యొక్క మొదటి ఆహారమైన తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి, సంపూర్ణ పోషణ లభిస్తుందని తెలియజేశారు.

తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం విజయవంతం చేయటానికి వైద్యారోగ్య శాఖతోపాటు అనుబంధ శాఖలైన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మొదలైనవి సహకరించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్, జిల్లా ఆరోగ్య విద్య విస్తరణాధికారి బి. శివ సాంబి రెడ్డి, బి.రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధి కొరకు గల్ఫ్ వెళ్ళే వారికి ముందస్తు ప్రయాణ అవగాహన



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ఉపాధి కొరకు గల్ఫ్ దేశాలకు వెళ్ళేవారికి ప్రయాణ జాగ్రత్తలు ఉద్యోగ మెళకువలపై శిక్షణ కల్పించి గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా మాత్రమే గల్ఫ్ దేశాలలో ఉద్యోగ అవకాశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ జనరల్ మేనేజర్ బిఆర్ క్రాంతి కుమారి తెలిపారు.

ఉపాధి అవకాశాలు పొందేందుకు గల్ఫ్ వర్కర్లకు అందించాల్సిన శిక్షణపై ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ జనరల్ మేనేజర్ బిఆర్ క్రాంతి కుమారి విజయవాడ ఐటిఐ కళాశాల ప్రాంగణంలో గల ఓంకాప్ కార్యాలయంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప, చిత్తూరు, కాకినాడ, విజయవాడ జిల్లా ఉపాధి కల్పనా అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనరల్ మేనేజర్ బిఆర్ క్రాంతి కుమారి మాట్లాడుతూ విదేశాలలో ఉపాధి అవకాశాలు కొరకు వెళ్ళే వారికి పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ఉపాధి కొరకు గల్ఫ్ వెళ్ళే వారి సంఖ్య నానాటికి పెరుగుతుందన్నారు. సరైన అవగాహన లేక గల్ఫ్ దేశాలలో ఉపాధి కోసం వెళ్ళిన వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సరైన ధృవపత్రాలతో ప్రభుత్వ అనుమతితో నడపబడే రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్ళేలా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కోరే వారు అవగాహన పూరిత నిర్ణయం తీసుకోవాలి. గృహకార్మికులుగా పని చేయుటకు తగిన నైపుణ్యం ఉండేలా నైపుణ్య శిక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సరిపైన వివరాలతో కనీసం 6 నెలల పాటు చెల్లుబాటయ్యే పాస్‌పోర్ట్ వర్క్ వీసా తప్పనిసరిగా ఉండాలన్నారు. గృహ కార్మికులు విదేశాలకు వెళ్ళే ముందు ఆరోగ్య ఆర్థిక విషయాల పట్ల పై శ్రద్ధ చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. విమానాశ్రయం వద్ద పాటించాల్సిన భద్రత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి అవకాశం పొందిన వారికి లైంగిక వేధింపులు, హింస, ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు భారతీయ రాయబార కార్యాలయాన్ని సంప్రదించాల్సిన విధానంపై అవగాహన కల్పించాలన్నారు. గల్ఫ్ వర్కర్లు పూర్తి స్థాయిలో శిక్షణ అందించి సురక్షితంగా ఉద్యోగాలను నిర్వహించుకునేలా కృషి చేయాల్సిన బాధ్యత ఓంకాప్ జిల్లా ఉపాధి కల్పన అధికారులు సయుక్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓంకాప్ హెచ్ ఆర్ మేనేజర్ ఎం సతీష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ జి. గోపి, విశాఖపట్నం శ్రీకాకుళం, కడప, కాకినాడ, చిత్తూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది మనోరమ, వై రవీంద్రనాద్ కుమార్, శివసాయి రెడ్డి, శిరీష, వివేక్, టి. విద్యాసాగర్ పాల్గొన్నారు.



## అమృత్ పథకం నిధులు ఏ మేరకు వచ్చాయి

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం నగరానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అమృత్ పథకం నిధుల వివరాలు తెలియజేయాలని ఎంపీ బాలశౌరి గురువారం జరిగిన పార్లమెంట్ సమావేశాలలో కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిని కోరారు. నీటి సరఫరా కోసం రెండు ప్రాజెక్టులు, మురుగునీరు, సెప్టేజీ కోసం ఒక ప్రాజెక్ట్ నిర్వహణ, నీటి పారుదల కోసం రెండవ ప్రాజెక్ట్, పార్కుల అభివృద్ధికి మూడవ ప్రాజెక్ట్ అమృత్ కింద ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం నగరానికి రూ. 80 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు అయ్యాయి అని పనుల పురోగతి తెలపాలని ఎంపీ అన్నారు. ఈ పథకం కింద పనులు ఏ దశలో ఉన్నాయి. వాటి వివరాలు కావాలని కోరారు. ఆ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలన్నారు.

## పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా ఎంపీ బాలశౌరి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఎంపీ కార్యాలయం నుంచి నోట్‌ను విడుదల చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులుగా మొత్తం 19 మంది పేర్లను పరిశీలించగా అందులో 15 మందిని కమిటీ సభ్యులను ఎన్నుకోగా మచిలీపట్నం ఎంపీ బాలశౌరి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ కేంద్ర ప్రభుత్వ ఖాతాలను పరిశీలించనుంది.

## ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్





**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఉదయం గిలకలదిండి లో రూపుదిద్దుకుంటున్న ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సంబంధించిన పురోగతి పనుల వివరాలను ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.422 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణంలో డ్రెడ్జింగ్, నార్త్, సౌత్ బ్రేక్ వాటర్ పనులు చురుకుగా సాగుతున్నాయని, మొత్తం మీద 50 శాతం మేర పనులు పూర్తయినట్లు ఆంధ్రప్రదేశ్ మారిటైం ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు కలెక్టరు కు వివరించారు. మత్స్యశాఖ జిల్లా అధికారి ఏ చంద్రశేఖర్, ఏపీ ఎమ్ఐడిసిఎల్ ఈఈ మునిరెడ్డి, ఏఈ మహేష్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వృద్ధులకు పింఛన్లు అందజేసిన కలెక్టర్



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఉదయం పెడనలో 16 వ వార్డు మచిలీపట్నం రోడ్డు సచివాలయం పరిధిలో వృద్ధురాలు పిచ్చుక మల్లికాంబ గృహం సందర్శించి, ఆమె ఆరోగ్యం గురించి కుశల ప్రశ్నలు అడిగి ఆమెకు 4000 రూపాయల వృద్ధాప్య పింఛను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ఆగస్టు నెలకు 2,40,939 మంది లబ్ధిదారులకు రూ 102.16 కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఇళ్ల వద్ద అందజేయుటకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య, మున్సిపల్ సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

## పలు పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** ఎస్పీగా ఆర్ గంగాధరరావు కృష్ణా జిల్లా లో బాధ్యతలు స్వీకరించిన తరువాత మొట్ట మొదటిసారిగా గురువారం మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను సందర్శించారు. ఆర్ పేట, బందరు తాలూకా పోలీస్ స్టేషన్‌లను బందరు డిఎస్పి అబ్దుల్ సుభాన్ తో కలిసి సందర్శించిన ఆయన సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరిం చారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను గూర్చి అడిగి తెలుసు కొని, రికార్డులన్నీ పరిశీలించారు. పోలీస్‌స్టేషన్లలో విచారణలో ఉన్న కేసు యొక్క పురోగతి, దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నది మొదలగు అంశాలను గూర్చి క్షుణ్ణంగా విశదీకరించారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలో గల పోలీస్ స్టేషన్ల వివరాలు, విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది గూర్చి, పోలీస్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాల సంఖ్య, జనాభా వివరాలు, సమస్యాత్మక ప్రదేశాలకు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ యొక్క పరిసరాలను గమనించి, ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అంతేకాక సిబ్బంది యొక్క సంక్షేమానికి ఎల్లవేళల కృషి చేయాలని, మీ స్టేషన్ పరిధిలో ఏదైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలని తెలియజేశారు.



## పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సౌమ్య

**చందర్లపాడు, ఆగస్టు 1, మేజర్ న్యూస్:** మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ మాటకు కట్టుబడి పెంచిన పెన్షన్లను అందజేస్తున్న ఘనత చంద్రబాబుదే అని చెప్పుకొచ్చారు. ప్రజల మధ్య పండగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేదల కోసం పరితపిస్తున్న సీఎం చంద్రబాబు అని అన్నారు. లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం ప్రస్ఫుటంగా కనబడుతోందన్నారు. ఎన్టీఆర్ భరోసా చరిత్రలో నిలవబోతున్నదని తెలిపారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు ప్రభుత్వం మనోధైర్యం కల్పిస్తోందన్నారు. 55 రోజుల్లో రెండోసారి పెన్షన్ పంపిణీతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వందకు వంద శాతం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోట వీరబాబు, టిడిపి మండల అధ్యక్షులు మేకల సుధాకర్, టిడిపి, జనసేన, బిజెపి తదిత నాయకులు పాల్గొన్నారు.

## చెత్త డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన కమిషనర్



**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్:** పట్టణములోని మధిర రోడ్డులోని చిన్న బ్రిడ్జి వద్ద ప్రైవేటు వ్యక్తులు చెత్త వేస్తుండంతో ఫిర్యాదు రావడంతో మునిసిపల్ కమిషనర్ కె.హేమమాలిని గురువారం వాగు బ్రిడ్జిని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో చెత్తను మొత్తం బాబ్ కాట్‌తో తొలగించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రైవేట్ వ్యక్తులు ఆ ఏరియాలో చెత్త వేయకుండా పర్యవేక్షించాలని సచివాలయ సి బ్బందిని ఆదేశించారు.చెత్తను తొలగించిన ప్రాంతములో సున్నం,బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమములో మునిసిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజి నీర్ ఫణి శ్రీనివాసరావు, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ గురునాధం పాల్గొన్నారు.

## జ్వాలా ప్రసాద్ నూతన కారును ప్రారంభించిన ఎమ్మెల్యే



**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్:** పట్టణలోని కాకాని నగర్ శాసనసభ్యులు కార్యాలయంలో తెదేపా నేత అమ్మినేని జ్వాలా ప్రసాద్ నూతన వాహనాన్ని స్థానిక నేతలతో కలిసి ప్రారంభించిన శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిగూడెం లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి



**రెడ్డిగూడెం మేజర్ న్యూస్:** రెడ్డిగూడెం మండలంలో గురు వారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి అధికారులతో కలిసి పంపిణి కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన పింఛన్ 4000 రూ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో గురువారం ఒక్క రోజులోనే 90% పైబడి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు జానలపాటి వేణుగోపాలరెడ్డి, పైడిమర్ల కిరణ్ కుమార్ రెడ్డి, కొండపల్లి బాబు, బాలకృష్ణ, కోటేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# మాటకు కట్టుబడి పెన్షన్ల పంపిణీ





**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** గతంలో మాట తప్పను అని ప్రగల్భాలు పలికిన వైఎస్ జగన్ వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు సమయం తీసుకున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నందిగామ పట్టణం 7, 9, 20 వార్డులలో, అంబారుపేట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ మాటకు కట్టుబడి పెంచిన పెన్షన్లను అందజేస్తున్న ఘనత చంద్రబాబుదే అని చెప్పుకొచ్చారు.ప్రజల మధ్య పండగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేదల కోసం పరితపిస్తున్న సీఎం చంద్రబాబు అని అన్నారు. లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం ప్రస్ఫుటంగా కనబడుతోందన్నారు. ఎన్టీఆర్ భరోసా చరిత్రలో నిలవబోతున్నదని తెలిపారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు ప్రభుత్వం మనోధైర్యం కల్పిస్తోందన్నారు. 55 రోజుల్లో రెండోసారి పెన్షన్ పంపిణీతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబు వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో పరిపాలన బాగుందని ప్రజలు గ్రహించారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వందకు వంద శాతం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం,అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఏ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ కే హేమమాలిని, టిడిపి, జనసేన, బిజెపి తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా కలపాల వెంకటరమణ జన్మదిన వేడుకలు

**గన్నవరం, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** గన్నవరంలో ప్రముఖ న్యాయవాది కలపాల వెంకటరమణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన పుట్టిన రోజున పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని ఆలోచనతో అనాధ పిల్లల ఆశ్రమాలకు, పేద విద్యార్థులకు నిత్యవసర వస్తువులు, దుస్తులు, పుస్తకాలు, బస్ పాసులు పంపిణీ చేసిన కలపాల. పేద విద్యార్థులు చదువుకోవడానికి చేసే ఆర్థిక సహాయం పేద ప్రజలకు సహాయం చేయడంలో ఉన్న ఆనందమే వేరు అని అన్న కలపాల వెంకటరమణ. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి అధ్యక్షులు పొట్లూరి బసవరావు గన్నవరం తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, మాజీ బారు అసోసియేషన్ అధ్యక్షుడు సోమేశ్వరావు నల్లమోతు రమేష్ నిడమర్తి బుజ్జారావు కె.వి.ఆర్ కిషోర్ కొండేటి కొండ నాగబోయిన గిరీష్ రాజు (నాని ) నల్లమోతు నానిబట్టు ఋషి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ తీర్పుకు న్యాయవాదులు హర్షం



**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్:**సమన్యాయం, అందరికీ సమానత్వం, ఎస్సీలలో రిజర్వేషన్ల వర్గీకరణ జరగాల్సిన ఆవశ్యకత ఉందని, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతృతంలో భారత అత్యున్నత న్యాయస్థానమును ఆశ్రయించారు. దానిలో భాగంగా గురువారం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అనుకూలంగా తీర్పును వెలువరించడం పై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ ఆధ్వర్యంలో నందిగామ కోర్టు భవన సముదాయంల ఆవరణలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు, సీనియర్ న్యాయవాదులు కాట్రా సత్యనారాయణ, దాదా హుస్సేన్ తదితర న్యాయవాదులు పాల్గొని, హర్షం వ్యక్తం చేశారు.

## బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

**కోడూరు, మేజర్ న్యూస్:** బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు ఇవ్వాలని టిడిపి శేషకుమారి అన్నారు. గురువారం కోడూరు శివారు నాయుడుపేట అంగన్వాడీ సెంటర్‌లో తల్లి పాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి నుంచి ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు ప్రతి అంగన్వాడి సెంటర్‌లో నిర్వహించి బిడ్డ తల్లులకు తల్లిపాల విశిష్టతను గుర్చి తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.రాజేశ్వరి,హెచ్ వి పద్మ, ఎం ఎల్ హెచ్ పి పద్మజ, ఏఎన్ఎం సునీత, గర్భవతులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



**గన్నవరం, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** గురువారం ఉంగుటూరు మండల విద్యాశాఖ అధికారులకు మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం మండల నాయకులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లా డుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కాబడిన కూటమి ప్రభుత్వం మధ్యా హ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించిన మెనూ లో పలు రకాల మార్పులు చేసింది అని దానికి అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు, పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్ సిలిండర్ల ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు, వంట పాత్రలు, యూనిఫాం రెండు జతలు (కాటన్) ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలల్లో రాజకీయ వేదింపులు ఉన్నాయని వాటిని నిలువరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు సి హెచ్ లక్ష్మీ, ఉపాధ్యక్షులు షేక్ మహబూబీ, నాయకులు నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన కాలవలో గుర్రపు డెక్క తొలగింపును పరిశీలించిన జనసేన నేతలు



**కోడూరు, మేజర్ న్యూస్:** అవనిగడ్డ కోడూరు ప్రధాన పంట కాలవలో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని కోడూరు మండల జనసేన పార్టీ నేతలు పరిశీలించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ చొరవతో కోడూరు మండల వ్యాప్తంగా ఉన్న కాలవల్లో, డ్రైనేజీలో గుర్రపు డెక్క, పూడి కతీత పనులను సంబంధిత శాఖ అధికారులు వేగంగా నిర్వహిస్తున్నారని, రైతంగం సాగు నీటి విషయంలోఎక్కడ కూడా ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతో అవనిగడ్డ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ కాలువల ప్రక్షాళన మొదలు పెట్టారని జనసేన నేతలు తెలిపారు. సందర్భంగా డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్కు కోడూరు మండల రైతాంగం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షులు మరే గంగయ్య, కోడూరు టౌన్ పార్టీ అధ్యక్షులు కోట రాంబాబు, పూత బోయన కరుణ్ కుమార్, పూత బోయన సాయి బాబు, మాజీ డిసి వైస్ చైర్మన్ కాగిత రామారావు, చందు రామాంజనేయులు కోట సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఆదరాభిమానాలు చూరగొన్న కూటమి ప్రభుత్వం





**కోడూరు, మేజర్ న్యూస్:** పేదలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము ఒకేసారి పెంచి అందిస్తున్న ప్రభుత్వముగా ఎన్డీఏ ప్రభుత్వం నిరుపేదల ఆదరాభిమానాలు చూరగొంటోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం కోడూరు 7,8,9 వార్డుల్లో ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథకం ద్వారా నిరుపేద లబ్ధిదారులు వేమూరి కృష్ణకుమారి, గొర్ల అమరావు, యార్లగడ్డ శేషగిరిరావు, భీమవరపు విలియమ్, జరుగు సుమతి, వనమాల గాలి దేవుడు, కడవకొల్లు శేషమ్మలకు పింఛన్లను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రభుత్వంలో నిరుపేదలకు అత్యధిక మేలు కలిగించేలా పెన్షన్ సొమ్మును మొదటి నెలలోనే పెంచి అందిస్తూ పేదల కళ్ళల్లో ఆనందం నింపిన ప్రభుత్వంగా నిలిచిందన్నారు. లబ్ధిదారులకు పెన్షన్ సొమ్మును వారి ఇంటి వద్దకే ఒకటో తేదీ తెల్లవారుజామునే అందిస్తూ ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో ఆర్ శ్రీనివాసరావు, కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత, కోడూరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బడే గాంధీ, కోడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ చైర్మన్ పూతబోయిన కరుణ్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు -దివిసీమ అధ్యక్షులు పూతబోయిన సీతా రత్న సాయిబాబు, కోడూరు జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, మాజీ డీసీ వైస్ చైర్మన్ కాగిత రామారావు, పూతబోయిన లక్షణ, బడే వెంకటస్వామి, కడవకొల్లు మల్లి, కార్యదర్శి ఎలవర్తి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య ప్రదాయిని



**ఆగస్టు 1న ప్రారంభమైన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**

**జిల్లా కలెక్టర్ డా. జి.సృజన**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య ప్రదాయిని అని.. బిడ్డకు తల్లిపాలను మించిన శ్రేయస్కరం మరొకటి లేదని పేర్కొంటూ గురువారం ప్రారంభమైన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అన్నారు. గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1-7) ప్రారంభమైన సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి.సృజన మాట్లాడుతూ అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం.. ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయని వివరించారు. తల్లిపాల వారోత్సవాల ఔన్నత్యాన్ని తెలియజేయడం, తల్లిపాలు ఇవ్వడంలో అపోహలను తొలగించడం, క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశాలు ప్రత్యేక సెషన్లతో అవగాహన కల్పించడం, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్హణ, 2కే ర్యాలీలు, గృహ సందర్శనలు, ర్యాలీలు వంటివి ఈ వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఆసుపత్రుల్లో బాలింతలకు, గర్భిణీలకు తల్లిపాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని.. తల్లిపాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. తల్లిపాల విశిష్టతను చాటిచెప్పి, పుట్టిన నాటినుంచే చిన్నారులకు తల్లిపాలను అందించేలా మహిళలను చైతన్యవంతులుగా చేసేందుకు జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డల శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. తల్లిపాలలో పోషకాలు పిల్లల్ని అనారోగ్యాలు, ఇన్ఫెక్షన్ల బారినుంచి కాపాడతాయన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన తల్లి శారీరక, మానసిక స్థితిని అర్థం చేసుకొని భర్త, కుటుంబ సభ్యులు ఆమెకు తోడుగా నిలవాలని కలెక్టర్ సృజన పిలుపునిచ్చారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో జరిగే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు విజయవంతమయ్యేలా జిల్లా మహిళాభివృద్ధి, శుశు సంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి కృషిచేస్తున్నారు.

## గంగాభవాని అమ్మవారికి శాకంబరీ అలంకారం



**కోడూరు, మేజర్ న్యూస్:** ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని కోడూరు ప్రజల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న శ్రీ గంగాభవాని అమ్మ వారికి ఈనెల నాలుగో తేదీ అనగా ఆదివారం శాకాంబరి అలంకారం చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధర్ రావు తెలిపారు. తొలిసారి అమ్మవారికి ఈ అలంకారం చేయ నున్న నేపథ్యంలో అలంకారం కోసం కూరగాయలు సమర్పించే భక్తులు శుక్రు, శనివారాల్లో ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని ధర్మకర్త కోరారు. శాకంబరి అలంకారానికి భక్తులు తమ సహాయ సహకారాలు అందించాలని యుగంధర్ రావు కోరారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



**కోడూరు, మేజర్ న్యూస్:** దివిసీమ గాంధీ, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ పునర్నిర్మాత స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలు పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తునట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు అధ్యక్షులు పూతబోయిన సీతా రత్న సాయిబాబు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల4 తేదీ అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి, గాంధీ క్షేత్రం, లయన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు - దివిసీమ, రోటరీ క్లబ్ ఆఫ్ అవనిగడ్డ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ లయన్ చిగురుపాటి మంజువాణి బ్లడ్ బ్యాంక్ వారిచే స్వచ్ఛంద రక్త శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9:30లకు ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారని సాయిబాబు తెలిపారు. ఈ శిబిరంలో జనసైనికులు, టీడీపీ నాయకులు, మండలి అభిమానులు, రక్తదాతలు పెద్దసంఖ్యలో తరలివచ్చి శిబిరాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఆరో వార్డులో ఘనంగా లాయర్ కరిముల్లా జన్మదిన వేడుకలు



**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్:** పట్టణంలో యాదవ బజార్ లోని యాదవుల భావి వద్ద లాయర్ కరిముల్లా పుట్టినరోజు సందర్భంగా తోటకూర కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చాయ్ బిస్కెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాయర్ కరీముల్లా యూత్ సభ్యులు లాయర్ కరిముల్లా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు సుమారు 300 మందికి టీలు బిస్కెట్లు అందజేసి లాయర్ కరిముల్లా నాయకత్వాన్ని అందరూ బలపరచాలని రాబోయే రోజుల్లో లాయర్ కరీముల్లా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించే విధంగా ప్రజలందరూ తమ అభిమానాన్ని మద్దతును తెలియజేయాలని తోటకూర కోటేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తోటకూర సీతారావమ్మ, జానీ, మస్తాన్, యాకూబ్ వలి, కరిముల్లా తదితర ఎల్కే యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ



**కోడూరు, మేజర్ న్యూస్:** మెరక గౌడపాలెం ఎన్టీఆర్ విగ్రహం వద్ద అధికారులతో కలిసి కూటమినేతలు ఘనంగా ప్రారంభించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెన్షన్లు పెంచి ఇస్తానని చెప్పి ఇచ్చిన మాట నిలబెట్టుకుని లబ్ధిదారులకు నేరుగా ఇంటి వద్ద కు వెళ్లి పంపిణీ చేయడం ఈ పంపిణీ కార్యక్రమంలో మేము కూడా భాగస్వాములు అవ్వటం హర్షించదగ్గ విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరి, పిల్లి మల్లికార్జునరావు, ముద్దినేని చంద్రరావు, బచ్చు వెంకటేష్,దావు మళ్లీ యార్లగడ్డ రమణ, బెల్లంకొండ కూర్మ కోటేశ్వరరావు, మోర్ల మాణిక్యాలరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, బండే వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు శుభవార్త



**కోడూరు, మేజర్ న్యూస్:** కోడూరులోని శ్రీ దాన శక్తి ఆర్యవైశ్య ప్రార్ధన మందిరంలో ఈనెల 3 వ తేదీ అనగా శనివారం లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ వారు 8వ జాబ్ డ్రైవ్ ను టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వారి సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత పూతబోయిన అయ్యప్ప స్వామి మాట్లాడుతూ దివిసీమ మారుమూల గ్రామాల్లో ఉన్న విద్యార్థుల టాలెంట్ ను వెలికి తీసే కార్యక్రమంలో భాగంగా ఎనిమిదవ జాబ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన 7 జాబ్ డ్రైవ్‌లలో సుమారు 300 మంది యువత శిక్షణ తీసుకుని ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలలో ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఈ జాబ్ డ్రైవ్ లో ఎంపికైన యువతకు ఉచిత స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి, ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున దివిసీమ ప్రాంత యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని పూతబోయిన అయ్యప్ప స్వామి తెలియజేశారు. లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు మాచర్ల నారాయణ 9989783755 బడే నాని 9014440114 బండే జయ కిషోర్ 9642439111 సంప్రదించవచ్చన్నారు.

## పింఛన్‌దారుల పరవశం వారి కుటుంబాలలో ఆనందం





**కంచికచర్ల ఆగస్టు 1 మేజర్ న్యూస్ :** సూర్యోదయానికే పింఛన్ పంపిణీ కార్యక్రమం ఒక పండగ వాతావరణం తలపిస్తుందని నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని పేరకలపాడు గ్రామంలో ఎమ్మెల్యే పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ పేదల సంక్షేమంమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్మును ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారని ఆమె స్పష్టత చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా ఉదయం 6 గంటలకే పింఛనుదారులకు పింఛను పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ పింఛను సొమ్మును ప్రతి ఒక్క పింఛనుదారు సద్వినియోగం పరుచుకోవాలని ఆమె సూచించారు. ఇది పూర్తిగా పేదల ప్రభుత్వం అని,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి అహర్నిశల శ్రమిస్తున్నారని తెలియజేశారు. ముందుగా గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యే సౌమ్యకు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మన్నే సాత్విక టిడిపి పార్టీ మండల అధ్యక్షులు కోగంటి బాబు,చవళం శ్రీనివాసరావు,గ్రామ పార్టీ అధ్యక్షులు కనకాల వాసు,గుర్రం రామకృష్ణ,నన్నపనేని బాబు,చవళం కిరణ్, ఏపూరి మాణిక్యం,అజిత, కనకాల మాధవి లక్ష్మి,అత్తిమల్ల విజయ,ఏపూరి నాగార్జున, ఏపూరి శీను పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీల పరిశీలన





## రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

### కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు ఆదేశాలు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఐఏఎస్ గురువారం ఉదయం 30వ డివిజన్, రామకృష్ణాపురం మధ్య కట్టలో తానే స్వయంగా లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకొని, వారితో మాట్లాడి, ప్రతి నెల పెన్షన్ వస్తుందా లేదా? ఇంటి వద్దనే పెన్షన్ ఇస్తున్నారా లేదా? ఎంత పెన్షన్ ఇస్తున్నారు? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి సెక్రటరీలు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. తదుపరి 29వ డివిజన్ మధురానగర్‌లో గల రోడ్ అండర్ బ్రిడ్జ్, బిఆర్‌టిఎస్ రోడ్డు దగ్గర గల జిఎస్ శాస్త్రి పార్క్ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చివరి దశలో ఉన్న రోడ్ అండ్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్ నిర్మాణ పనులను పూర్తి చేసి త్వరలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. బుడమేరు కాలువలోని గుర్రపు డెక్కులను తీసి కాలువను పరిశుభ్రపరచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఫుడ్ జంక్షన్ దగ్గరలో గల జిఎస్ శాస్త్రి పార్క్ ను సందర్శించిన కమిషనర్, పార్క్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం ఎల్లప్పుడూ ఉంచాలని, పారిశుద్ధ నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, పార్క్ ఆవరణలో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

# సభ్యత్వ నమోదులో అవనిగడ్డ ప్రథమ స్థానం సాధించాలి

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** జనసేన సభ్యత్వ నమోదులో అవనిగడ్డ మొదటి స్థానం సాధించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం అవనిగడ్డ పంచాయతీ కార్యాలయం ఎదురుగా జనసేన పార్టీ వీర మహిళలు ఏర్పాటు చేసిన జనసేన సభ్యత్వ నమోదు శిభిరాన్ని బుధవారం సందర్శించి నాలుగో విడత సభ్యత్వ నమోదులో కూడా 500 పైగా సభ్యత్వాలను చేర్చిన వీర మహిళ బచ్చు కృష్ణ కుమారి ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జనసైనికుడు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అడుగు జాడల్లో నడవాలని కోరారు. నియోజకవర్గంలో మూడవ విడతలో పది వేల సభ్యత్వాలు నమోదు చేసిన నియోజకవర్గ క్రియా వాలంటీర్లు ఈసారి పది వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేయటం ప్రశంసనీయమన్నారు. జిల్లాలో మొదటి స్థానం సాధించే స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేయాలని కోరారు. ఆగస్టు 5వ తేదీ వరకు అవనిగడ్డ సెంటరులో కొనసాగే ఈ శిబిరాన్ని నియోజకవర్గ జనసైనికులు సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ క్రియాశీలక సభ్యత్వం పొందాలని కోరారు. జనసేన పార్టీ మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గాజుల శంకర్రావు,చన్నగిరి సత్యనారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షులు బొప్పన పృథ్వి, అవనిగడ్డ ఎంపీటీసీ బొప్పన భాను, అశ్వారావుపాలెం ఎంపీటీసీ కటికల వసంత్, పార్టీ నాయకులు పప్పుశెట్టి శ్రీను, కోసూరు అవినాష్, వార్డ్ సభ్యులు అడపా ప్రభాకర్, మత్తి శివపార్వతి, బండే నాగమల్లేశ్వరి,రేపల్లె రోహిత్, నాయకులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ పై అవగాహన సదస్సు






**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎస్ఆర్ఆర్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డ్రగ్ రహిత ఆంధ్ర ప్రదేశ్ పైన అవగాహన సదస్సును స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో విజయవాడ వెస్ట్ వారు ఎస్ఆర్ఆర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి డ్రగ్ రహిత ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంతో, యువత మేలుకో, భవితను మలుచుకో, డ్రగ్స్ ను వదులుకో, డ్రగ్స్ రహిత సమాజం-సంక్షేమానికి సాంకేతం అని అసిస్టెంట్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆఫీసర్ రామ శివ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజాన్ని కోరుతుందని, దీనికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పైన ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకి దూరంగా ఉండాలని, యువత దేశానికి పట్టుకొమ్మలని, సన్మార్గంలో పయనించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, యువత దేశానికి ఎంతైనా అవసరమని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు మదకద్రవ్యాల పైన అవగాహన కార్యక్రమాల్ని విరివిగా కొనసాగించడం అభినందించదగ్గ విషయమని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం ఎన్ఎస్ఎస్ వారి బాధ్యతని తెలిపారు ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్యూరో విజయవాడ వెస్ట్ సిఐ శ్రీనివాస రెడ్డి ఎస్సై అల్లూరయ్య, కళాశాల పిడి డాక్టర్ డి యుగంధర్, అధ్యాపకులు డాక్టర్ నవీన డాక్టర్ రాధిక ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఈనెల 15వ తేదీన విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ జి. సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్ తదితరులు వర్చువల్ గా హాజరయ్యారు. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్గనిర్దేశం చేశారు. అదే విధంగా అదేరోజు సాయంత్రం రాజ్ భవన్ లో జరగనున్న ఎట్ హోం కార్యక్రమానికి సంబంధించి కూడా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శన, ముఖ్యమైన భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరణ, వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలు, పోలీస్ బందోబస్తు తదితరాలపై సిఎస్ సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సృజన ఈ సందర్భంగా తెలిపారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు..

## కానూరు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కానూరు గ్రామంలో కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ ఆధ్వర్యం లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇంటి ఇంటికి పెన్షన్ పంపిణి కార్యక్రమం కానూరు గ్రామంలో ఉదయం 4 గంటల నుంచి ప్రారంభించామని తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. ఇందులో భాగంగా కానూరు గ్రామంనకు 454 పెన్షన్లకు గాను సుమారుగా 22 లక్షలు కానూరు గ్రామంనకు విడుదల చేశారు. తెల్లవారుజామునే పెన్షన్లు ఇవ్వడంతో కానూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని తమ పెద్దకొడుకువలే భావించి కానూరు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. సదరు ప్రోగ్రాంకి బొమ్మిడి ఏడుకొండలు,దివి మహేష్, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, బొలిశెట్టి నాని, మోకా వెంకన్న, మోకా ఏడుకొండలు, వంకా కాశీ, గమిడి ఇమ్మనీయేలు, బొమ్మిడి కొండలరావు, సేరు శ్రీరాములు, చెక్క రామారావు తదితరులు పాల్గొన్నారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999